# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 29 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసి పర్యవేక్షించేలా చేపట్టిన “సంజీవని” ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **తెలంగాణలోని మేడారంలో జరుగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతరలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం ఈరోజు పాల్గొంటారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో జలవనరుల ప్రాజెక్టుల ఆర్థిక అనుమతులకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
4. **ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

-----------------------

ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసి పర్యవేక్షించేలా చేపట్టిన "సంజీవని" ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు

మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత ద్వారా నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించేలా, వారి ఆరోగ్య రికార్డులను డిజిటలీకరణ చేసే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండేలా ఆస్పత్రుల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

-----------------------

తెలంగాణలోని మేడారంలో జరుగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతరలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం ఈరోజు పాల్గొంటారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో కేంద్ర మంత్రిని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. హెలిప్టర్ లో ఈ ఉదయం కేంద్రమంత్రి మేడారం చేరుకుని సమ్మక్క సారలమ్మల ప్రత్యేక పూజలల్లో పాల్గొంటారు. మహాజాతరలో ప్రధాన ఘట్టమైన సమ్మక్క ఆగమనం ఈ రోజు జరగనుంది. చిలకలగుట్ట నుండి సమ్మక్కను గద్దెపైకి తెచ్చే ప్రక్రియ ఈ రోజు సాయంత్రం ఆదివాసీ సాంప్రదాయాల నడుమ నిర్వహిస్తారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని పలు జలవనరుల ప్రాజెక్టుల ఆర్థిక అనుమతులకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 35 అజెండా అంశాలకు మంత్రి వర్గం నిన్న ఆమోదం తెలిపింది. ఈ సమావేశ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరిస్తూ....

వాయిస్..30 సెకన్లు

-----------------------

సమీకృత కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ శిక్షణ-iGOT కర్మయోగి వేదికపై కోటి మంది నమోదై, లక్షల మంది కోర్సు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సామర్థ్యాభివృద్ధిలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతూ, కర్మయోగి కార్యక్రమాన్ని

విజయవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రమని పేర్కొంది. నిరంతర అభ్యాసం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించేలా సామర్థ్యాలను పెంపొందించడం పట్ల ఈ నమోదు ఇతర రాష్ట్రాలకు నిదర్శనంగా నిలుస్తోందని తెలిపింది.

-----------------------

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఏపియస్ఆర్టీసీ పనితీరు, సేవల నాణ్యత, స్త్రీ శక్తి పథకం అమలుపై విజయవాడలోని ఆర్టీసీ భవన్ లో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్లలో నీటి శుద్ధి కేంద్రాలు, సౌచాలయాల పునరుద్ధరణకు 24 కోట్ల రూపాయలను కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెట్టనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన రెగ్యులేటర్ పనులను జూన్ 2026 కు పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వెలిగొండ ప్రాజెక్ట్ పురోగతి పై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లమల సాగర్ లో నీరు నిల్వ చేయడానికి, విడుదల చేయడానికి హెడ్ రెగ్యులేటర్లు అత్యవసరమని తెలిపారు. 2024 నుండి 18 నెలల కాలంలో 4 వేల 563 మీటర్ల మేర బెంచింగ్ పనులు పూర్తి చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్...30 సెకన్లు

-----------------------

ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కచ్చితమైన సమాచార వ్యవస్థ ఉండేలా 100 కోట్ల రూపాయలతో అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

-----------------------

భారతీయ వార్తా పత్రికల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. 1780 జనవరి 29వ తేదీన మొదటి భారతీయ వార్తా పత్రిక “హికీస్ బెంగాల్ గెజిట్" కలకత్తాలో ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ పత్రికను కలకత్తా జనరల్ అడ్వర్టైజర్ అని కూడా పిలుస్తారు. ఈ పత్రిక అందించే వార్తలు, వ్యాసాలు అప్పట్లో ప్రజలను ఆలోచింప చేసే విధంగా వుండేవి.

-----------------------

ఖనిజాలు వెలికి తీసిన తర్వాత గనులను పర్యావరణహితంగా మూసేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న గనుల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన మాట్లాడారు. జిల్లాల్లో చేపడుతున్న గనుల మూసివేత కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పునరుజ్జీవం, జలవనరుల సంరక్షణ, వాయుకాలుష్య నియంత్రణ, వాతావరణ సమతౌల్యం ఉండేలా గనుల మూసివేతను చేపట్టాలన్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాత్రి సమయంలో చలి

గాలుల తీవ్రత కొనసాగుతోంది. రానున్న మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జిమాడుగులలో 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణిలో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

= = = = = = = = = = = = = = = = =